సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 159 | శనివారం, 01 నవంబర్ 2025



# అధికారుల్లో సమన్వయ లోపం కనిపిస్తోంది..

- వరంగల్ వరదల్లో స్పష్టంగా కనిపించింది
- ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- మొంథా తుఫాన్‌తో 12 జిల్లాల్లో ప్రభావం
- కలెక్టరేట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష

2

హనుమకొండ, మన చౌరాస్తా : 'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు.





# అధికారుల్లో సమన్వయ లోపం

- వరంగల్ వరదల్లో స్పష్టంగా కనిపించింది
- ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
- కలెక్టరేట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష



**హనుమకొండ, మన చౌరాస్తా :** 'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం.. తాజా వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్లు మునిగిన వారికి రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన సీఎం రేవంత్ సమ్మయ్య నగర్, పోతన నగర్, రంగంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. పంట నష్టం అంచనా వేయాలని.. పంట నష్టం అంచనాలో ప్రజా ప్రతినిధులను తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని అన్నారు. పేరుకుపోయిన చెత్తనంతా క్లియర్ చేయాలని.. ఓరుగల్లును త్వరగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ అన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయంగా ముందుకెళ్లాలని.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని అన్నారు. బాగా దెబ్బతిన్న ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వరంగల్ నగరంలో చెరువులు నాళాల కబ్జాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదలొద్దని హెచ్చరించారు. ఫ్లడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఇరిగేషన్ శాఖ సంసిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. చెరువుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోపై లెక్కలు పక్కాగా ఉండాలని ఆదేశించారు.

### నాళాల కబ్జాపై ఉక్కు పాదం

నాళాల కబ్జాపై ఉక్కు పాదం మోపాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఒక్కరితో వందల మంది ఆగం కావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఆజ్ఞాపించారు. ఇసుక మేటలు వేసిన పొలాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు చేయాలని సూచించారు. ఇండ్లు కోల్పోయిన వాళ్ల లిస్ట్ సిద్ధం చేసి ఇండ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ముంపు తీవ్రత పెరిగిందని చెప్పుకొచ్చారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా చూసుకోవాలని, వరద ప్రభావంపై పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు విజిట్ చేయాలని హుకుం జారీ చేశారు. మొంథా తుఫానుపై ఆస్తి, పంట నష్టం అంచనాలు చేసే సమయంలో ప్రజాప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, పశు సంపద నష్టంపై నివేదికలు తెప్పించాలని ఆజ్ఞాపించారు. తుఫానుకి దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. క్లౌడ్ బరస్ట్‌లు భవిష్యత్‌లోనూ వస్తాయని తెలిపారు. వర్ష ప్రభావిత సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశర చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర నిధులు కూడా తెచ్చుకుందామని తెలిపారు. గతంలో కేంద్ర నిధులు వాడుకోలేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి రూపాయి వచ్చేలా రాష్ట్ర అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, కలెక్టర్ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరాకు రూ.లక్ష అయినా ఇస్తామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ఇండ్లు, పంటలు, పశువుల నష్టంపై పూర్తి నివేదిక కావాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని ఆజ్ఞాపించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, మేయర్ గుండుసుధారాణి, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారు.



# రక్తదానంతో ఆరోగ్య ప్రయోజనాలు

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, అలా చేయడం వల్ల దాతలకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జనగామలోని నెహ్రూ పార్క్ సమీపంలో కామక్షి ఫంక్షన్ హల్ లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. రక్తదానంతో అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సమాజంలో రక్తదానం అత్యంత మహత్తర సేవ అని, ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవాలన్నారు. డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఏసీపీ పందరి చేతన్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# పంటల బీమా చట్టం అమలు చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాన్ ప్రభావంతో సుమారు 32 వేల ఎకరాలలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ధ్వంసమైందని, పంటల బీమా చట్టం అమలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ అన్నారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జనగామ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చందు నాయక్ మాట్లాడుతూ రైతులు చెమటోడ్చి పండించిన పంటలు తుఫాన్ వల్ల ధ్వంసమైపోయిన పరిస్థితుల్లో, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బోడ నరేందర్ తెలంగాణ రైతు సంఘం పట్టణ కార్యదర్శి మంగ బీరయ్య , రమావత్ మీట్యా నాయక్, కూరాకుల శ్రీనివాస్ బి.అంజయ్య కర్రె బీరయ్య కందుల వెంకటేశ్వర్లు జాయ రమేష్ బాలబోయిన రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మృతి.. 25 మందికి గాయాలు
- హనుమకొండ - సిద్దిపేట రహదారిపై ఘటన



భీమదేవరపల్లి, మన చౌరాస్తా : భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో గురువారం అర్ధరాత్రి భయానక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లి బృందం ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బోర్‌వెల్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

## పెళ్లి ఇంట విషాదం

సిద్దిపేట జిల్లా పాలమాకుల మండలం వెంకటాపురం నివాసితులైన కుటుంబ సభ్యులు 3 రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదన్‌పల్లి గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిపి తిరుగు ప్రయాణం అవుతున్నారు. మొత్తం 34 మంది బొలెరోలో వస్తుండగా కొత్తపల్లి సమీపంలో కొందరు వాహనం దిగుతున్న సమయంలో ప్రమాదం జరిగింది.

## చనిపోయిన వారివివరాలు

ఈ ప్రమాదంలో రెడ్డబోయిన స్వప్న(15) ఘటనాస్థలంలోనే మృతి చెందగా, రెడ్డబోయిన కళమ్మ(55), శ్రీనాథ్(7) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఉత్తమ్‌రాజు పరిస్థితి విషమంగా ఉండగా, అనసూయ, అక్షయ, శివశంకర్, అక్షిత, చిక్కుడు దేవేందర్, రాజనర్సక్కతో పాటు మరికొందరు తీవ్రంగా గాయపడి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## పోలీసులు చేరుకోగానే..

సమాచారం అందుకున్న ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూరు ఎస్సై రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 108 అంబులెన్సుల తో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం అనంతరం బోర్‌వెల్ లారీ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పరామర్శించిన సీపీ

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఎంజీఎం ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శించి, వైద్యుల నుంచి వారి ఆరోగ్య స్థితి గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య సిబ్బందికి మరింత శ్రద్ధ వహించాలని సూచించారు.



# తెలంగాణ బీసీ జేఏసీ కన్వనర్‌గా గటిక విజయ్ కుమార్



**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ బీసీ జేఏసీ కన్వీనర్ గా డాక్టర్ గటిక విజయ్ కుమార్ ను నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హైదరాబాద్ లో గురువారం నియామక పత్రం అందించారు. వరంగల్ జిల్లా నెక్కొండ కు చెందిన విజయ్ కుమార్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. సీనియర్ జర్నలిస్టు అయిన విజయకుమార్ పలు సామాజిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహిస్తున్నారు. హైదరాబాదులోని అశోక హోటల్ లో తెలంగాణ బీసీ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడం పై చర్చ జరిగింది. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించడంతోపాటు చట్టసభల్లో కూడా బీసీ రిజర్వేషన్లు సాధించి రాజ్యాధికారంలో వాటా దక్కించుకోవడమే లక్ష్యంగా ముందుకు పోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు త్వరలోనే బీసీ జేఏసీ చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ రథయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఎందుకోసం జిల్లా నియోజకవర్గాల వారీగా కోఆర్డినేటర్ అని కూడా నియమించాలని సమావేశంలో నిర్ణయించారు.



# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**తాడూరి రవీందర్ డిమాండ్**

**కొమరవెల్లి, మన చౌరస్తా :** కొమురవెల్లి మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఈరోజు రాంసాగర్ గ్రామంలో పరిశీలించారు అనంతరం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరు రవీందర్ మాట్లాడుతూ రైతులు అనేక పెట్టుబడులు పెట్టి పంటలు కోతకు వచ్చే సమయంలో అకాల వర్షాలు పడడం వలన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వేసిన పంటలు మండలంలోని అన్ని గ్రామాలలో రైతులు వేసిన పంటలు ప్రధానంగా వరి మరియు పత్తి పంటలు బాగా దెబ్బ తిన్నాయని కల్లాలలో పోసిన వడ్లు నాని రైతులకు తీవ్ర నష్టం కలిగించినయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రధానంగా మండలంలోని అన్ని గ్రామాలలో వ్యవసాయ అధికారుల ద్వారా నష్టపోయిన పంటలను సర్వే చేయించి ఎకరాకు పత్తికి 50 వేల రూపాయలు చొప్పున వరికి 40 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని తడిసిన ధాన్యాన్ని మరియు పత్తిని ఎటువంటి కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులు ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తాడూరి నరేష్ అక్కేనపల్లి సంజీవ రెడ్డి తాడూరి అనిల్ కుమార్ చింతల ఇంద్రుడు తాడూరి ప్రవీణ్ పాకనాటి బలు తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా ఉంటాం..

**బచ్చనపేట, మన చౌరాస్తా :** ఆపదలో ఉన్నవారికి తోచిన సహాయం చేసి ఆదుకుంటామని బచ్చన్నపేట మండల యువ నాయకులు బండారి రసూల్ అఖిల్ మాల అన్నారు కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన నల్ల రాజేందర్ రెడ్డి దశదినకర్మ సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ రాజేందర్ మృతి చాలా బాధాకరమని ఆయన స్నేహితులందరం కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇజ్జగిరి రాములు, నాగకేశవ్, కార్తీక్, స్టాలిన్, అనిల్, కిరణ్, వెంకటేష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

కొమురవెల్లి, మన చౌరాస్తా : గరిబీ హఠావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందని మహదేవుని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 1966లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయిన నాటికి దేశంలో ఆర్థిక మాంద్యం, పారిశ్రామిక ఉత్పత్తుల పతనం, ఎగుమతులు తగ్గడం, ఆహారధాన్యాల సంక్షోభం ఏర్పడ్డాయనీ, వీటితో పాటు బడ్జెట్ డెఫిసిట్ పెరగడం, విదేశీ ఆర్థిక సాయంపై ఎక్కువగా ఆధారపడటం వంటివే గాక 1962, 1965నాటి యుద్ధాలు, పాకిస్థాన్- చైనా కూటమి ఏర్పాటులో సైన్యంపై ఖర్చు పెంచడం వంటివీ జరిగాయన్నారు. వర్షాలు లేక కరువు ఏర్పడిందనీ ధరలు పెరిగాయనీ పాలనా ఖర్చులు తగ్గించుకోవడం వీలుపడలేదనీ అయినా, యుద్ధ ప్రాతిపదికన ఆహార ధాన్యాలు సేకరించి, ప్రజలకు పంచి, వారి ప్రాణాలు కాపాడగలిగారనీ ఇందిరాగాంధీ ధైర్య సాహసాలు మరే నాయకురాలు కనిపించవని అన్నారు. 'నా దేశం గొప్పది' అనే గర్వం ఆమెలో ప్రస్ఫుటంగా అగుపడేదనీ భారత్ ఎదగబోయే స్థాయిని అంచనా వేసుకుని ఉప్పొంగిపోయేవారన్నారు. అందుకే, దేశ ప్రాధాన్యాలు, దేశ గౌరవం కాపాడ్డంలో ఇందిర రాజీపడేవారు కాదనీ కొనియాడారు. బాడీగార్డ్స్ చేతుల్లో 1984 అక్టోబర్ 31న ఇందిర అస్తమించారనీ దేశం గొప్ప నాయకురాలిని కోల్పోయిందనీ బడుగు, మైనార్టీ ప్రజలంతా తమ 'అమ్మ'ను కోల్పోయినట్లుగా బాధపడ్డారనీ దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన ఇందిర చిరస్మరణీయురాలనీ మహాదేవుని శ్రీనివాస్ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.



# జమాల్ షరీఫ్ జూబ్లీహిల్స్‌లో ప్రచార బాధ్యతలు



జనగామ, మన చౌరాస్తా : జనగామకు చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్ జమాల్ షరీఫ్ కు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా పరిశీలకుడిగా నియమిస్తూ బోరబండ డివిజన్ లో ప్రచార బాధ్యతలను అప్పగిస్తూ టీపీసీసీ మైనార్టీ ఇన్‌చార్జి హెచ్.ఎం షకీల్ నవాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జమాల్ షరీఫ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. నవీన్ యాదవ్ విజయానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ రాజీలేని పోరాటం

- ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు అందె అశోక్




**చేర్యాల, మన చౌరాస్తా :** కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న గొప్ప కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర నాయకులు అందె అశోక్ అన్నారు. శుక్రవారం కార్మిక సంఘం 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద కార్మిక సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర కార్మిక సంఘం ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న దేశ వాణిజ్య రాజధాని ముంబాయి నగరంలో పురుడు పోసుకున్నదన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులలో కార్మిక గర్జవల నుండి ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం అందరి కన్నా ముందే నినదించిన ఏకైక సంఘం ఏఐటీయూసీ, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పోరు కలిపిన మొనగాడి సంఘం కార్మిక హక్కుల కొరకు జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం అలుపెరగని పోరాటాలు చేసి కార్మిక వర్గం నేడు అనుభవిస్తున్న సౌకర్యాలను అమల్లో ఉన్న చట్టాలను అన్నిటినీ సాధించిందన్నారు. నేడు భారతదేశంలో కార్మిక వర్గం నెత్తురు చిందించి ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర ఉందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెడుతుందన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ రంగాలను పరిరక్షించేందుకు కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని వారు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్ రెడ్డి, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, చింతల నరేష్, నంగి సత్తయ్య, మల్లిగారి నరసింహులు, సకినాల సాయినాథ్, ఎండి.గోరెమియా, కార్మికులు పాల్గొన్నారు.



# శ్రీరాములుకు ఘన సన్మానం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో పనిచేసే సిరిగిరి శ్రీరాములు శుక్రవారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పడిగన్నగారి ఆంజనేయులు, వేములవాడ దేవాలయ ఉద్యోగం అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ తదితరులు శ్రీరాములు ఘనంగా సన్మానించారు. ఆలయానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధర్మకర్తలు మండలి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, కే జయప్రకాష్ రెడ్డి, కే మోహన్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు .

# సర్దార్ వల్లభాయ్ పటేల్ కు ఘన నివాళి

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** భారత చరిత్రలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు అనగానే మనకు గుర్తొచ్చేది ధృడమైన సంకల్పం, అచంచల నాయకత్వం, దేశ ఐక్యతకు ప్రాణం అర్పించిన వ్యక్తిత్వం అని మహదేవుని శ్రీనివాస్ కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1875 అక్టోబర్ 31న గుజరాత్‌లోని నాడియార్ గ్రామంలో జన్మించిన ఆయన, న్యాయవృత్తిని చేపట్టినా, దేశ స్వాతంత్ర్య పోరాటమే తన జీవిత ధ్యేయంగా మలచుకున్నారు. మహాత్మా గాంధీ ప్రభావంతో ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి పాల్గొని, అనేక ప్రజా సంఘటనలకు పునాదులు వేశారు.వల్లభాయ్ పటేల్ జయంతి మనకు స్ఫూర్తిదాయక క్షణం. మనం ఆయన చూపిన ఐక్యత, కర్తవ్య బోధ, ధైర్య సాహస మార్గంలో నడవడం ద్వారానే నిజమైన దేశభక్తిని ప్రతిఫలింపజేయగలం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి శ్రీనివాస్, కాయిత శ్రీనాథ్ రెడ్డి, లింగంపల్లి కనకరాజు, సానాది భాస్కర్, సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, జంగని రవి, బత్తిని నర్సింహులు, ఏర్పుల రాజు, మల్లం బాలయ్య, జనగాం శ్రీకాంత్, వంగ ప్రసాద్ రెడ్డి, ఉప్పల వంశీకృష్ణ, యేనిశెట్టి కిరణ్, ముత్యం అంజయ్య గౌడ్, (కోల్ బాయ్) సార్ల కనకయ్య, మల్లం శ్రీనివాస్, పొన్నం శేఖర్, స్వాములపల్లి రమేష్, మేడికుంట శ్రీనివాస్, చింతల పర్షరాములు, ముత్యం కరుణాకర్, దుర్గయ్య మరియు చింతల రమేష్ పాల్గొని నివాళులు అర్పించారు.



# నేటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

చేర్యాల, మన చౌరాస్తా : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ లో ఉన్న బిల్లులు వేతనాలను వచ్చే వరకు మధ్యాహ్న భోజనాన్ని బందు పెడుతున్నామని నేటి నుండే సమ్మెను ప్రారంభిస్తున్నామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ తెలిపారు. శుక్రవారం రోజున చేర్యాల మండలంలోని ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సిబ్బందికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ 9 నెలల కాలం నుండి ఎగ్గు బిల్లులు పెండింగ్లో ఉన్నాయని ఐదు నెలల నుండి ఐదు నెలల నుండి కూరగాయల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అలాగే తొమ్మిది నెలల నుండి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ₹1000 ఐదు నెలల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 2000 వేతనం పెండింగ్ లో ఉన్నాయని ఒకవైపు పెట్టినటువంటి పెట్టుబడి రాక మరోవైపు వేతనాలు రాక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అప్పులు చేసి మరి వంటలు వండుతున్న సరైన వంటలు చేయట్లేదు అంటూ ఒకవైపు అధికారులు వేధిస్తున్నారని మరోవైపు తెచ్చిన అప్పులకి మిత్తులు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇలాంటి తరుణంలో పెండింగ్ బిల్లులు పెండింగ్ వేతనాలు వచ్చేంతవరకు మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు చేయబోరని స్పష్టం చేశారు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పెండింగ్ బిల్లులు పెండింగ్ వేతనాలు వచ్చే విధంగా చూడాలని కోరారు లేని పక్షంలో ఈ సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బండకింది అరుణ్, దండేబోయిన భాస్కర్, తుప్పతి రాజు, మధ్యాహ్న భోజన కార్మికులు ఓరుగల్లు వేంకటవ్వ, తాడురి సౌభాగ్యలక్ష్మి, చిర్ల రజిత, ముచ్చెల్లి కృష్ణవేణి, పోలోజు పద్మ, గుడ్ల పద్మ, తరిగొప్పుల స్వప్న,చింతకింది కనకవ్వ, మంజ నర్సమ్మ, ఉత్కం పద్మ, తదితరులు పాల్గొన్నారు.



# బచ్చన్నపేట హాస్పిటల్లో తనిఖీలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** డిప్యూటీ కలెక్టర్ తేజస్విని బచ్చన్నపేట గవర్నమెంట్ హాస్పిటల్‌ను పరిశీలించారు. హాస్పిట్ పరిసరాలు, వార్డులు, వ్యాక్సిన్ స్టోర్ ఫార్మసీ స్టోర్ అలాగే ల్యాబ్ రికార్డులను చెక్ చేశారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహో డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీతేజ, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, మండల వైద్య అధికారి డాక్టర్ సృజన, డాక్టర్లు దీప్తి, అరుణ, ఉమా, ఆదిలక్ష్మి, ప్రసన్న, కృష్ణ, సిద్ధి సుదర్శన్ రెడ్డి, హెడ్ నర్స్ లక్ష్మి, అనిత, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, సుకన్య ఉన్నారు.



# శ్రీనివాసరావుకు సత్కారం

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కలవల శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో శుక్రవారం నిర్వహించారు. గత 36 సంవత్సరాలుగా పౌర సంబంధాల శాఖ లో వివిధ హోదాల్లో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని పలువురు జర్నలిస్టులు ఆయన సేవలను కొనియాడారు. ఇకపై శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యులతో గడపాలని వారు కోరారు. శ్రీనివాసరావుకు చిరు కానుకతో సత్కరించారు. సీనియర్ జర్నలిస్టులు కన్న పరశురాములు, ఆనంద్, శ్రీకాంత్ రెడ్డి, కిరణ్, భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు తెచ్చి కొనుక్కున్నాం ఆదుకోండి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఇటీవలే కురిసిన మొంతా తుఫాన్ దాటికి మల్లారం గ్రామానికి చెందిన బోనగాని మొగిలి, ఇటవేనా రవిలకు చెందిన రెండు ఆవులు మృతి చెందాయి. ఆవుకు 80 వేల రూపాయల చొప్పున అప్పులు చేసి ఇటీవలే కొనుక్కున్నామని తమకు జీవనాధారమైన ఆవులను కోల్పోవడంతో నష్టాల్లో కూరుకుపోయామని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.